# తెలుగు హరికథకు 'ఆది' పురుషుడు 'ఆదిభట్ల'



ఆంధ్ర రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన జానపద కళలలో తోలుబొమ్మలాటలు, హరికథ, బుర్రకథ, ఒగ్గుకథ, శారదకథ, నాటకాలు ఇలా ఎన్నో ఉన్నాయి. ఈ కథలలో ఎక్కువమందికి తెలిసింది హరికథే! ఆ హరికథకు ఆంధ్రదేశంలో ఆద్యుడు, హరికథా పితమహుడు అని పేరుతెచ్చుకున్నవాడు ఆదిభట్ల నారాయణదాసు. ఆయన తర్వాత కథకులుగా ఎందరో పేరుతెచ్చుకుని ఉండొచ్చు. కానీ, వారెవరూ నారాయణదాసుకు సాటిరారు. ఆయన జయంతి ఆగస్ట్ 31.

1864వ సంవత్సరంలో నేటి ఉత్తరాంధ్రలోని బొబ్బిలికి సమీపంలో ఉన్న అజ్జాడ అగ్రహారంలో జన్మించారు ఆదిభట్ల నారాయణదాసు. తల్లి లక్ష్మీ నరసమాంబ, తండ్రి వెంకట చయనులు.. ఆ కాలానికే ఆ ప్రాంతంలో కళలకు పుట్టినిల్లుగా, విద్యల నగరంగా పేరు తెచ్చుకుంది విజయనగరం. ఈ నగరంలోనే ఆదిభట్ల నారాయణదాసు జీవితం కొంత గడిచింది. విజయనగరంలో సంస్థానంలో చిన్నతనంలోనే స్థానం సంపాదించారాయన. అయిదేళ్ల వయసులో సంగీతంలో ఆయన చూపిన ప్రతిభ చూసి, బొబ్బిలి ఆస్థానంలో వైణికుడిగా ఉన్న సాంబయ్యగారు నారాయణదాసును విజయనగరం సంస్థానం తీసుకువచ్చారు. అక్కడే ఆయన సంగీతం నేర్చుకున్నారు.

మద్రాసు ప్రాంతంలో హరికథకు పేరుమోసిన కుప్పుస్వామి నాయుడు చెప్పిన ధృవచరిత్ర కథను నారాయణదాసు 19 ఏళ్ళ వయసులో విన్నారు. ఆ కథ నారాయణదాసు మనసులో నాటుకుపోయింది. అప్పుడే ఆయన హరికథవైపు ఆకర్షితులయ్యారు. కుప్పుస్వామినాయుడు గారి కోసం అదేరోజు రాత్రి కూర్చుని ఒక నృత్య రూపకం రాసి, మర్నాడు నాయుడి గారి ఎదుట ప్రదర్శించి, ఆయన ప్రశంసలు పొందారు నారాయణదాసు. ఆ తర్వాత హరికథా గానం పేరుతో నారాయణదాసు 10 గంటల నిర్విరామ ప్రదర్శన కూడా నిర్వహించారు.

1886లో నారాయణదాసు ఎఫ్.ఎలోచేరారు.ఆప్పటికి ఆయనకు సంగీత సాహిత్యాదులతోపాటు హిందీ, ఇంగ్లీష్, గ్రీకు, పర్షియన్, అరబిక్ భాషలలో నైపుణ్యాన్ని సంపాదించారు. హరికథాగానంతో పాటు సంగీతంలో అనేక ప్రయోగాలు చేసి పండిత పామరుల ప్రశంసలు పొందిన విశిష్ట వ్యక్తి నారాయణదాసు. స్వాతంత్ర్యోద్యమం కోసం ఎన్నో ప్రదర్శనలు ఇస్తూ వేలాది మైళ్లు ప్రయాణించిన సమరయోధునిగా ఖ్యాతినార్జించారు. తన ప్రదర్శనలతో ప్రజలలో ఎంతో స్ఫూర్తి రగిల్చిన ఘనుడాయన. 1915లో ఆంధ్రప్రదేశ్‌లోని మొదటి సంగీత కళాశాలను విజయనగరంలో ఏర్పాటు చేశారు. ఆ కళాశాలకు మొదటి ప్రిన్సిపాల్ నారాయణదాసే. ఆదిభట్ల ఆ పదవిలో సుమారు పదిహేను సంవత్సరాలున్నారు. హరికథ గానంలో ఆయన శైలిని నేటికీ ప్రత్యేకంగా చెప్పుకుంటారు.

హరికథా పితామహుడిగానే మనకు తెలిసిన నారాయణదాసు , జానకీ శపథము, రుక్మిణీ కళ్యాణము, అంబరీషచరిత్ర, హరిశ్చంద్రోపాఖ్యానము, భీష్మ చరిత్రము, గజేంద్రమోక్షము, మార్కండేయోపాఖ్యానము, ప్రహ్లాద చరిత్రము, సావిత్రీ చరిత్రము, ధృవోపాఖ్యానము, యదార్థ రామాయణము, భగవద్గీత, రామశతకము, శివశతకము, ముకుంద శతకము, మృత్యుంజయ శతకము, సూర్యనారాయణ శతకము, సత్యవ్రత శతకము, నూరుగంటి, వేల్పువంద, బాటసారి, నవరసతరంగిణి, పురుషార్థ బోధిని, ఉమర్‌ఖయ్యాం, కాశీ శతకము రామచంద్ర శతకము, శ్రీకృష్ణ కథామృతము, తారకం ఇలా ఎన్నో ఉన్నాయి.

ఇవన్నీ హరికథా వస్తువులే కాదు. సాహితీ విలువలతో కూడిన సాగరాలు. తన పాండితీ ప్రతిభతో హరికథకు ఓ రూపునిచ్చి , ఆ హరికథకు పితామహుడిగా ఖ్యాతిగాంచిన ఆ మహాపురుషుని ఈరోజు స్మరించుకుందాం!